
సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం : 21 : జూన్ : 2024



సార్వత్రిక ఎన్నికల్లో సేవలు భేష్

శాంతిభద్రతల పరిరక్షణతో పాటు జిల్లాలో నేరాల నిరోధానికి పటిష్ట చర్యలు **చేపట్టాలని ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు.** 8లో ▸



ఆన్‌లైన్‌లోనూ శ్రీవారి సేవలు

ద్వారకాతిరుమల చినవెంకన్న దర్శనం, ఆర్జిత సేవలు, వసతి, విరాళాల వంటి సేవలను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువచ్చింది. 8లో ▸

ఆరోగ్య యోగం

యోగా వ్యాయామమే కాదు, మనిషిని అత్యున్నత స్థితికి చేరవేసే సంపూర్ణ సాంకేతిక పరిజ్ఞానం. యోగా అంటే అసలు అర్థం ఐక్యం.



8లో

కూరగాయల ధర దడ

ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు.. అన్నట్టు ఉంది కూరగాయల ధరల పరిస్థితి. ఒక్కసారిగా ధరలు పెరగడంతో వినియోగదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. పది రోజుల వ్యవధిలో దాదాపు అన్నిరకాలూ రెట్టింపు కావడం సామాన్యులకు దడ పుట్టిస్తోంది. ఎండల తీవ్రతతో కూరగాయల పంటలకు నష్టం వాటిల్లడం, దిగుబడులు తగ్గడం ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మరికొద్దిరోజుల పాటు ధరలు ఇలానే ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు.

కొనలేం.. తినలేం

- చుక్కల్లో ధరలు.. జనం బెంబేలు
- ఉమ్మడి పశ్చిమలో 5 వేల ఎకరాల్లో సాగు
- ఎండల తీవ్రతతో తగ్గిన దిగుబడులు
- కిలో రూ.60 నుంచి రూ.100 వరకు..
- సెంచరీ దిశగా టమాటా, వంకాయ
- ఉల్లి, బంగాళాదుంప, క్యారెట్ ధరలకూ రెక్కలు
- మరికొద్ది రోజులు భారం తప్పదంటున్న వ్యాపారులు



కూరగాయల ధరలు (కిలో)

రకం	10 రోజుల క్రితం	ప్రస్తుతం
ఉల్లిపాయలు	రూ.25	రూ.45
వంకాయలు	రూ.40	రూ.100
బీరకాయలు	రూ.40	రూ.80
బెండకాయలు	రూ.40	రూ.80
పచ్చిమిర్చి	రూ.60	రూ.80
టమాటా	రూ.40	రూ.100
దొండ	రూ.30	రూ.60
క్యారెట్	రూ.40	రూ.50
బీట్‌రూట్	రూ.40	రూ.50
బంగాళాదుంప	రూ.25	రూ.40
అల్లం	రూ.150	రూ.200

సాక్షి, భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని గోదావరి పరీవాహక లంక గ్రామాలు, నూజివీడు, చింతలపూడి, కుక్కునూరు, వేలేరుపాడు, ఆగిరిపల్లి తదితర ప్రాంతాల్లోని 5 వేల ఎకరాల్లోను, పక్కనే ఉన్న డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలోని లంక గ్రామాల్లోని 15 వేల ఎకరాల్లో బీర, బెండ, దొండ, వంకాయ, దొండ, కాకర, ఆనబ తదితర పంటలు సాగవుతున్నాయి. గతేడాది డిసెంబర్‌లో వచ్చిన మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో రబీ కూరగాయల సాగు ఆలస్యం కావడం, ఈ ఏడాది వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉండటం పంటలకు నష్టం కలిగించింది. 45 డిగ్రీలు పైబడి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పూత మాడిపోయి దిగుబడులు దెబ్బతిన్నాయి. వర్షాభావ పరిస్థితులు పంటలకు నష్టం కలిగించాయని ఉద్యాన శాఖ అధికారులు అంటున్నారు.

రెట్టింపైన ధరలు

స్థానిక దిగుబడులు తగ్గిపోవడంతో గత పది రోజుల వ్యవధిలో బీర, బెండ, దొండ, ఆనబ, పచ్చిమిర్చి కూరగాయల ధరలు రెట్టింపు కావడం వినియోగదారులను బెంబేలెత్తిస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా వంకాయలు కిలో రూ.100కు చేరుకున్నాయి. తొలకరి వర్షాలతో వేసిన కూరగాయల పంటలు కొద్ది రోజుల్లో దిగుబడులు వచ్చినా, జూలైలో గోదావరికి వరదలు రానుండటంతో లంక భూములు ముంపునకు గురై పంటలకు నష్టం వాటిల్లే అవకాశముండటం ఆందోళనకు గురిచేస్తోంది. మెట్ట ప్రాంతంలో కూరగాయల పంటలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ధరలు తగ్గుముఖం పట్టే అవకాశముందని వ్యాపార వర్గాలు అంటున్నాయి. కోల్‌కతా, బెంగళూరు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునే బంగాళాదుంప, బీట్‌రూట్, క్యారెట్, క్యాబేజీ ధరలు కూడా పెరుగుతున్నాయి.

టమాటా మోత

అన్ని కూరల్లో ఎక్కువగా వినియోగించే టమాటా ధర కిలో రూ.100కు చేరుకుంది. చిత్తూరు, బెంగళూరు నుంచి రోజుకు జిల్లాకు 80 టన్నుల వరకు టమాటా దిగుమతి అవుతుంది. ఆయా చోట్ల పంటలు దెబ్బతినడం వలన ప్రస్తుతం 30 టన్నులు కూడా రావడం లేదని వ్యాపారులు అంటున్నారు. మరోపక్క ఉల్లిపాయల ధరలు కూడా దిగిరావడం లేదు. పది రోజుల క్రితం కిలో రూ.25లు ఉండగా ప్రస్తుతం రూ.45కు చేరింది. మహారాష్ట్ర దిగుమతులు తగ్గడం ఉల్లి ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది. బయటి మార్కెట్‌లో ధరలు ఇలా ఉంటే తోపుడు బండ్లు, సైకిళ్లపై అమ్మకాలు చేసే వారి వద్ద ఈ ధరలు మరింత అధికంగా ఉంటున్నాయని వినియోగదారులు అంటున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మరికొద్ది రోజులు ఇవే ధరలు కొనసాగే అవకాశముందని వ్యాపారస్తులు అభిప్రాయపడుతున్నారు. ధరలను చూసే భయమేస్తోందని వినియోగదారులు వాపోతున్నారు.

దిగుబడులు లేకపోవడంతోనే..



అధిక ఎండలు వలన కూరగాయల పంటలు దెబ్బతిని దిగుబడులు తగ్గిపోవడం వలన ధరలు పెరిగిపోతున్నాయి. నాణ్యమైన సరుకు రావడం లేదు. రవాణాలో కూరగాయలు పాడైపోవడం వలన వ్యాపారులు నష్టపోతున్నారు. మరికొద్ది రోజులు ఈ ధరలు కొనసాగే అవకాశం ఉంది.

– గురివెళ్ల నాయుడు, కూరగాయల వ్యాపారి, ఆకివీడు

ధరలు మండిపోతున్నాయి



మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కిలో రూ.60 నుంచి రూ.100ల వరకు ఉండటంతో కొనుగోలు చేసేందుకు పేద వర్గాల వారు ఇబ్బంది పడాల్సి వస్తోంది. వంటల్లో ఎక్కువగా ఉపయోగించే ఉల్లిపాయలు, టమాటా ధరలు చూస్తుంటే భయమేస్తోంది.

– రొక్కాల మేరీ, వినియోగదారురాలు, పాలకొల్లు

న్యూస్‌రీల్

ఉత్తమ సేవలందించాలి

డీఆర్వో ఉదయభాస్కరరావు



రెవెన్యూ డే వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజలకు మంచి సర్వీసులను అందించడానికి రెవెన్యూ ఉద్యోగులు ఎల్లప్పుడూ కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రెవెన్యూ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పని చేయడం గర్వకారణమన్నారు. ఉద్యోగులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలన్నారు. ఎన్నికలు, ప్రకృతి వైపరీత్యాలు తదితర సందర్భాల్లో రెవెన్యూ శాఖ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఏటా జూన్ 20న రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, రెవెన్యూ సేవలు, భూ వ్యవహారాలు, ధ్రువీకరణపత్రాలు, నీటి పన్ను తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టరేట్ పరిపాలనా అధికారి పి.పాపారావు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పనినేర్చుకుంటే గుర్తింపు ఉంటుందని, శాఖకు సంబంధించిన ప్రతి విషయాన్ని క్షుణంగా నేర్చుకోవాలన్నారు. రెవెన్యూ శాఖ ఉన్నతికి, అభివృద్ధికి అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం రిటైర్డ్ తహసీల్దార్ లక్కు నరసింహారావును సత్కరించారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్లు చందన దుర్గాప్రసాద్, సీహెచ్ రవికుమార్, టీఏ కృష్ణారావు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఫారం-16 జారీ



పెన్షనర్లకు ఫారం-16ను అందిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రభుత్వ పెన్షనర్లకు ఫారం-16ను గురువారం నుంచి జారీ చేస్తున్నట్టు ఉప ఖజానాధికారి అల్లూరి రవివర్మ తెలిపారు. భీమవరం ఉప ఖజానా కార్యాలయం పరిధిలోని పెన్షనర్లు 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఫారం-16ను పొందవచ్చన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.జేమ్స్ మాట్లాడుతూ ఫారం-16ను తీసుకుని ఐటీ రిటర్న్‌ను వచ్చేనెల 31లోపు దాఖలు చేయాలని, సందేహాలు ఉంటే పెన్షనర్ల అసోసియేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎస్. సత్యనారాయణరాజు, భీమవరం యూనిట్ కార్యదర్శి పాకలపాటి సీతారామరాజు, కోశాధికారి సూర్యనారాయణ, యూజీసీ అధ్యక్ష, కార్యదర్శులు జీవీ సత్యనారాయణరాజు, జేవీ సుబ్బారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏయూ భాస్కరరావు, అప్పన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరల పెంపు మోసపూరితం



కె.శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ఏలూరు (టూటౌన్): 2024-25 ఆర్థిక సంవత్సరానికి 14 రకాల పంటలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు మోసపూరితమని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. స్థానిక పవరుపేటలోని అన్నేభవన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా మద్దతు ధరలు పెంచలేదన్నారు. రైతుల వాస్తవ ఖర్చులను పరిగణనలోనికి తీసుకోకుండా మద్దతు ధరలు ప్రకటించడం వలన ఉత్పత్తి ఖర్చుల కంటే తక్కువ ధరలు వచ్చి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరికి క్వింటాల్‌కు కేవలం రూ.117లు పెంచి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. వరికి క్వింటాల్ ఉత్పత్తికి రూ.2 వేల వరకు ఖర్చు అవుతుందని దీని ధరను రూ.3 వేల వరకు పెంచాల్సి ఉందన్నారు. మొక్కజొన్నకు రూ.135లు, జొన్నకు రూ.191, పెసలుకు రూ.124, మినుములకు రూ.450, పొద్దు తిరుగుడుకు రూ.520, వేరుశనగకు రూ.406 మాత్రమే ధర పెంచారన్నారు. ఎరువులు, పురుగు మందులతో పాటు పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగిపోవడంతో రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగాయన్నారు. పెంచిన ధరలను పునఃపరిశీలన చేసి ఉత్పత్తికి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం మద్దతు ధరల గ్యారంటీ చట్టాన్ని తీసుకురావాలని శ్రీనివాస్ కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికులను బెదిరించడం తగదు



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మిక సంఘ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మధ్యాహ్న భోజన కార్మికులను వైదొలగాలని, లేకుంటే తామే తీసివేస్తామని అధికార పార్టీ నాయకులు బెదిరించి పలు మండలాల్లో ఒత్తిళ్లు తెస్తున్నారని, ఇలా చేస్తే తెలుగుదేశం పార్టీకి, ప్రభుత్వానికే నష్టమని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులపై వస్తున్న బెదిరింపులు, వేధింపులకు నిరసనగా గురువారం ఏలూరు డీఈఓ ఎస్.అబ్రహంకు మధ్యాహ్న భోజన కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ పెదవేగి, ద్వారకా తిరుమల, దెందులూరు, భీమడోలు మండలాల్లో గ్రామస్థాయి అధికార పార్టీ నాయకులు హెచ్చరికలు జారీ చేస్తున్నారని ఇవి పూర్తి అప్రజాస్వామిక పద్ధతులని అన్నారు. గతంలో కూడా ఇలాంటి చర్యలకు పాల్పడే ప్రజావ్యతిరేకతను మూటకట్టుకున్నారని, ఇప్పుడు కూడా టీడీపీ నాయకులు అలాంటి చర్యలకు పాల్పడటం భావ్యం కాదన్నారు. 20 ఏళ్లుగా తక్కువ జీతాలు ఇస్తున్నా నిబద్ధతతో పని చేస్తున్న తమపై అధికార పార్టీ జులుం ప్రదర్శించడం క్షమించరాని నేరమన్నారు. తక్షణమే బెదిరింపులు ఆపాలని, పాత వారిని కొనసాగించాలని ఆమె కోరారు. లేకుంటే ఎక్కడికక్కడే నిరాహార దీక్షలు చేస్తామని తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కక్ష సాధింపులకు పాల్పడటం మంచిది కాదని, ఇలా చేస్తే ప్రభుత్వానికే నష్టమన్నారు. దీనిపై డీఈఓ అబ్రహం స్పందిస్తూ మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓలు కమిటీకి తెలియకుండా, వారి ఆమోదం లేకుండా కార్మికులను తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన కార్మిక సంఘం నాయకులు లక్ష్మి, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో తామరాకుల తొలగింపు



కొండేపాడులో తామరాకులు తొలగిస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలు

సాక్షి స్పందన

పెంటపాడు: గత నెల 'సాక్షి'లో ప్రచురితమైన 'తాగునీటి చెరువులో తామరాకులు' కథనానికి ఉపాధి హామీ పథకం కూలీలు స్పందించారు. మండలంలోని కొండేపాడు గ్రామంలోని రెండు చెరువుల్లోని తామరాకులు తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఉపాధి హామీ పథకం కూలీలు నడుం బిగించారు. సుమారు 30 మంది కూలీలు గ్రామంలో రోజువారీ ఉపాధి హామీ పనులు చేస్తూనే.. మరోపక్క చెరువుల్లో శ్రమదానం చేసి తామరాకులు తొలగించారు. ఉపాధి హామీ టీఏ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నగేష్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు శ్రమించి చెరువులను శుభ్రం చేశారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేదల స్థలాలు ధ్వంసం

పోలవరంలో టీడీపీ నాయకుల దుశ్చర్య



ట్రాక్టర్‌తో ఇళ్ల స్థలాలను ధ్వంసం చేస్తున్న దృశ్యం



పేదలు కట్టుకున్న ఇళ్లపై టీడీపీ జెండాలు


చాట్రాయి: ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన సంఘటన ఏలూరు జిల్లా చాట్రాయి మండలం పోలవరం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. 2006లో గ్రామంలో సుమారు 3 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసింది. మూడు లేవుట్లలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేదలకు పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించారు. ఆయా స్థలాల్లో ముగ్గురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టారు. లేఅవుట్లలో గ్రావెల్ రోడ్లు, విద్యుత్ సౌకర్యాలను ప్రభుత్వం కల్పించింది. ఇళ్లు మంజూరు కాగానే నిర్మాణాలు చేపడతామని లబ్ధిదారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో ఇటీవల ప్రభుత్వం మారడంతో ఇళ్ల స్థలాల్లో వేల రూపాయల ఖర్చుతో ఏర్పాటుచేసిన గ్రావెల్ రోడ్లను టీడీపీ నాయకులు ట్రాక్టర్‌తో దున్ని ధ్వంసం చేశారు. అలాగే నివేశన స్థలాల్లో టీడీపీ జెండాలు కూడా కట్టారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది వెళ్లి ఇది ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూమి అని ధ్వంసం చేయడం నేరమని చెప్పినా పట్టించుకోలేదు. దీనిపై గ్రామ రెవెన్యూ కార్యదర్శి తేజ ఫిర్యాదు మేరకు నూజివీడు ఆర్డీఓకు నివేదిక పంపినట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ పులకేశ్వరావు తెలిపారు.

యజ్ఞ కర్త జంధ్యాలకు సత్కారం

భీమవరం (ప్రకాశంచౌక్): అతిరాత్ర మహాయాగ యజ్ఞకర్త జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మను భీమవరం బిల్డర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గన్నాబత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ భీమవరంలో 11 రోజులపాటు అతిరాత్ర మహాయాగం నిర్వహించి అందరినీ పునీతం చేసిన యజ్ఞకర్త శర్మ వ్యక్తి కాదు మహా సంస్థ అని, కోట్లాది రూపాయలు వెచ్చించినా ఇటువంటి కార్యనిర్వహణ చాలా కష్టమని, అటువంటి నిర్వహణ చేసి వేలాది మంది భక్తులను రప్పించి ఆధ్యాత్మిక చైతన్యం కల్పించిన వ్యక్తి శర్మ అని కొనియాడారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రెండు నెలలుగా శర్మ పలుచోట్ల అన్వేషించి భీమవరంలో యాగాన్ని నిర్వహించడం అద్భుతమని అన్నారు. శర్మ మాట్లాడుతూ ప్రజల సంకల్పంతోనే ఇటువంటి యాగాలు సాధ్యమవుతాయని, సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మను సత్కరించారు. కార్యక్రమంలో బిల్డర్ పుష్పాల శేషు, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ దాడులు దురదృష్టకరం

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి దేవ రాజేష్‌కుమార్




పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీ శ్రేణుల అరాచకాలు రోజురోజుకూ శృతి మించుతున్నాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి దేవ రాజేష్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు పాలకొల్లులో గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను, అలాగే వైఎస్సార్ సీపీకి ఓటు వేశారనే లక్ష్యంతో దళిత, బహుజన వర్గాలకు చెందిన వారిపై దాడులకు పాల్పడటం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమే అని, ఎన్నికల్లో గెలుపోటములు సహజమని తెలిపారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా జతకట్టి సింగిల్‌గా పోటీ చేసిన వైఎస్సార్ సీపీపై విజయం సాధించామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాల భవనాలపై ఉన్న శిలా ఫలకాలను ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. అధికారుల సహకారంతో కూటమి చేస్తున్న అరాచకాలపై కోర్టులు స్పందించాలని, దాడులు జరిగిన చోట సుమోటాగా కేసులు నమోదు చేయాలని కోరారు. బాధితులు పోలీసులను ఆశ్రయించినా ఫలితం ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంజనీరింగ్ కాలేజీల్లో డొనేషన్ల పర్వం

సొమ్ములు కట్టు.. సీటు పట్టు..

- జిల్లాలో 15 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు
- ఏపీఈఏపీ సెట్‌లో 8,459 మంది ఉత్తీర్ణత
- మేనేజ్‌మెంట్ కోటా కింద రూ.6 లక్షల వరకు డొనేషన్ వసూలు
- ఫీజు ఏడాదికి మరో రూ.2 లక్షల వరకు
- అడ్డగోలు వసూళ్లను పట్టించుకోని అధికారులు



భీమవరం: జిల్లాలో విద్యా వ్యాపారం జోరుగా సాగుతోంది. నెలరోజులుగా ప్రాథమిక, హైస్కూల్ విద్యనందించే కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో సీట్ల అమ్మకం జరుగుతుండగా ఇటీవల ఏపీఈఏపీ సెట్ ఫలితాలు విడుదల కావడంతో ఇంజనీరింగ్ కళాశాలలు పెద్ద ఎత్తున వ్యాపారం ప్రారంభించాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంజనీరింగ్ కళాశాలల్లో వసతులను బట్టి ఫీజు నిర్ణయించడంతో పాటు పూర్తి ఫీజును రీయింబర్స్‌మెంట్ ద్వారా ప్రభుత్వమే కాలేజీలకు చెల్లించింది. అలాగే మేనేజ్‌మెంట్ కోటా ఫీజులను కూడా నియంత్రించేలా చర్యలు తీసుకుంది. ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గతంలో మాదిరిగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజుల పెంపుదలకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి. దీనిలో భాగంగా ఇంజనీరింగ్ కళాశాలలు డొనేషన్ల పర్వానికి తెరదీశాయి. ఈ ఏడాది ఏపీఈఏపీ సెట్ పరీక్షలకు ఇంజనీరింగ్ విభాగంలో 10,738 మంది విద్యార్థులు హాజరుకాగా 8,459 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 4,393, బాలికలు 4,066 మంది ఉన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 3,276 మంది ఉత్తీర్ణత సాధించగా వీరిలో బాలురు 707, బాలికలు 2, 569 మంది ఉన్నారు.

మేనేజ్‌మెంట్ సీట్లు 3,609 : గతేడాది లెక్కల ప్రకారం జిల్లాలో 15 ఇంజనీరింగ్ కళాశాలల్లో సుమారు 12 వేల వరకు సీట్లు ఉన్నాయి. వీటిలో కన్వీనర్ కోటా కింద 8,421 సీట్లు భర్తీ కాగా, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు 3,609 ఉన్నాయి. కన్వీనర్ కోటా సీట్లు కౌన్సెలింగ్‌లో పూర్తయ్యే అవకాశం ఉండగా మేనేజ్‌మెంట్ కోటా సీట్లను ఆయా కళాశాలల యాజమాన్యాలు భర్తీ చేసుకుంటున్నాయి. కళాశాలల్లోని వసతులు, ఫ్యాకల్టీ, క్యాంపస్ సెలెక్షన్స్‌లో ప్లేస్‌మెంట్ల ఆధారంగా విద్యార్థులు ఆయా కళాశాలలకు ప్రాధాన్యమిస్తారు. ఏపీఈఏపీ సెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారు పేర్గాంచిన యూనివర్సిటీలు, కళాశాలలకు ప్రాధాన్యమిస్తుండగా మిగిలిన వారు స్థానికంగా ఉండే కళాశాలలను ఎంచుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును నేరుగా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేయడంతో కళాశాలలు అవకతవకలకు పాల్పడే అవకాశం లేకుండా పోయింది.

రూ.20 లక్షల వరకు ఖర్చు

జిల్లాలో పేరున్న కొన్ని ఇంజనీరింగ్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా కింద సీటుకు రూ.6 లక్షల వరకు డొనేషన్ వసూలు చేస్తున్నట్టు సమాచారం. ప్రధానంగా డిమాండ్ ఉన్న సీఎస్ఈ, ఈసీఈ కోర్సులకు మొదటి ఏడాది రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు డొనేషన్, మరో రూ.2 లక్షలు ఫీజు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. ఇంజనీరింగ్‌లో మిగిలిన మూడేళ్ల ఏడాదికి రూ.2 లక్షల వరకు ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. హాస్టల్ ఫీజు ఏడాది రూ.లక్ష, ఇతర పరీక్షల ఫీజులు వంటి వాటితో ఒక విద్యార్థి నాలుగేళ్ల ఇంజనీరింగ్ పూర్తిచేసేందుకు సుమారు రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులు పలువురు మేనేజ్‌మెంట్ కోటా కింద సీటు సంపాదించేందుకు మక్కువ చూపడంతో కళాశాలలు డొనేషన్లను పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. మరికొన్ని కళాశాలల్లో రూ.3.50 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు డొనేషన్, రూ.లక్ష ఫీజు చెల్లించాలని కళాశాలలు షరతులు పెడుతున్నట్టు తెలిసింది. ప్రభుత్వం నిర్ణయించే ఫీజులు ఎలా ఉన్నా కళాశాలలు నిర్ణయించే ఫీజులే చెల్లించాలని కచ్చితంగా చెబుతుండటం విశేషం. ఇంజనీరింగ్ కళాశాలలపై ప్రభుత్వ నియంత్రణ లేకుంటే డొనేషన్లు, ఫీజులు మరింత పెంచి వసూలు చేస్తారనే ఆందోళనను విద్యార్థుల తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

తణుకు వైనాట్‌కు హావెల్స్ రత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న వైనాట్ సంస్థ అధినేత వెంకటరాయుడు

తణుకు : రాష్ట్రంలో బెస్ట్ హోం అప్లయెన్సెస్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన తణుకు వైనాట్ సంస్థ ఈ ఏడాదిలో మరో మైలు రాయిని అధిగమించినట్లు సంస్థ అధినేత జుజ్జువరపు వెంకటరాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం నార్వేలో జరిగిన అవార్డు కార్యక్రమంలో హావెల్స్ బ్రాండ్ చైర్మన్ అనిల్‌రాయగుప్తా అమ్మకాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచినందుకుగాను వైనాట్ షోరూమ్‌ల అధినేత జుజ్జువరపు వెంకటరాయుడుకు హావెల్స్ రత్న అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైనాట్‌పై వినియోగదారులు చూపిస్తున్న ప్రేమ, విశ్వసనీయతకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

తణుకు : తణుకు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని పైడిపర్రు బ్రిడ్జిపై ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. జయంతి టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సు అమలాపురం నుంచి హైదరాబాదు వెళుతుండగా పైడిపర్రు బ్రిడ్జిపై ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తేతలి గ్రామానికి చెందిన పంది అయ్యప్ప అలియాస్ మణికంఠ, పైడిపర్రుకు చెందిన సాయిదుర్గాప్రసాద్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తణుకులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. ప్రమాదానికి కారణమైన జయంతి ట్రావెల్స్ బస్సును రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొల్లేరులో అటవీ శాఖ దాడులు.. 7 టన్నుల రొయ్యల స్వాధీనం




అటవీశాఖ కార్యాలయం వద్ద రొయ్యల వ్యాన్

ఏలూరు రూరల్: జిల్లా అటవీశాఖ అధికారులు గురువారం కొల్లేరులో నిర్వహించిన దాడుల్లో సుమారు రూ.15 లక్షల విలువైన రొయ్యలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఏలూరు వన్యప్రాణి విభాగం డీఆర్వో ఆశోక్‌కుమార్ తన సిబ్బందితో కలిసి మధ్యాహ్నం 12 గంటలకు ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడు పరిధి కాంటూరు పరిసరాల్లోని ఓ రొయ్యల వద్ద జరుగుతున్న పట్టుబడిని అడ్డుకున్నారు. చెరువు-బిలో కాంటూరు పరిధిలో ఉందంటూ చెరువులో రొయ్యలు స్వాధీనం చేసుకున్నారు. రెండు వ్యానుల్లో లోడ్ చేసిన సుమారు 7 టన్నుల రొయ్యలను ఏలూరు అటవీశాఖ కార్యాలయం వద్దకు తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు రొయ్యలను వేలం వేసి, వచ్చిన సొమ్మును ప్రభుత్వానికి జమ చేస్తామన్నారు.

ఆరోగ్య యోగం

- యోగా సాధనతో మానసిక, శారీరక ఆరోగ్యం
- ధ్యానంతోనూ ఒత్తిడి, వ్యాధుల నియంత్రణ
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న యోగా సాధకులు
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం





వీరవాసరంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు (ఫైల్)

వీరవాసరం/పాలకొల్లు సెంట్రల్: యోగా అంటే శరీరాన్ని అసాధ్యమైన భంగిమల్లో తిప్పడం లేదా శరీరాన్ని మెలికలు తిప్పటం, తలకిందులుగా వేలాడటం కాదు. యోగా అనేది కేవలం వ్యాయామమే కాదు.. మనిషిని అత్యున్నత స్థితికి చేరవేసే ఒక సంపూర్ణ సాంకేతిక పరిజ్ఞానం. యోగా అంటే అసలు అర్థం ఐక్యం. అన్నిటితో ఐక్యమైతే అదే యోగా. నిజానికి మానవుని అనంతమైన మేధాశక్తి, ఆత్మశక్తిల కలయికే యోగా. 2014 సంవత్సరంలో ఐక్యరాజ్యసమితిలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించిన సందర్భంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి ఏటా జూన్ 21న జరుపుకుంటున్నారు. అప్పటి నుంచి యోగా ఆవశ్యకత, బలం, సమతుల్యత, శారీరక సామర్థ్యం పెంచడంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన కార్యక్రమంగా యోగా నిలిచింది. యోగాసనాలు వేస్తే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. అంతేకాక మానసిక ప్రశాంతత, మెదడు చురుగ్గా ఉంటుంది. ఇప్పుడు యువత కూడా జిమ్ కంటే యోగాసనాలపైనే ఎక్కువగా ఆసక్తి చూపుతోంది. వ్యక్తులను శారీరకంగా, మానసికంగా, దృఢంగా మార్చడంలో యోగా చాలా ప్రభావం చూపుతుంది.

నిత్య సాధనతో అనేక ప్రయోజనాలు

శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి యోగా ఒక గొప్ప మార్గం. యోగా సాధన వల్ల మనసు, శరీరం రెండింటినీ ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. యోగా ఒత్తిడిని తగ్గిస్తుంది. ముఖ్యంగా విరామం లేకుండా పనిచేసిన తర్వాత యోగా చేస్తే ఒత్తిడి తగ్గుతుంది. శ్వాస పీల్చి కాసేపు బంధించి ఉంచడం వలన గుండె, దమనులను ఆరోగ్యంగా ఉంటాయి. యోగా రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. రక్తం గడ్డ కట్టకుండా కాపాడడం ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. మైగ్రేన్ తలనొప్పి తగ్గించడంలో కొన్ని యోగాసనాలు ఎంతో సహాయపడతాయి. యోగా ద్వారా కండరాలు, మోకాళ్లను బలంగా, సాఫీగా చేస్తుంది. మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. యోగా సాధన వల్ల ధ్యానం, శ్వాసక్రియలు మనసు ప్రశాంతంగా ఉండేందుకు సహాయపడతాయి. వయసుతో సంబంధం లేకుండా రోజూ గంట లేదా 30 నిమిషాలు యోగా చేయడం ఆరోగ్యదాయకం. యోగా చేయడం వల్ల ఒత్తిడి తగ్గడమే కాకుండా హరించుకుపోతున్న మానవ సంబంధాలు కూడా పెంపొందించుకోవచ్చు. విద్యార్థులు ఒత్తిడిని జయించి జ్ఞాపకశక్తి మెరుగుపరుచుకోవచ్చు. గత సంవత్సరం నుంచి కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక యోగా శిక్షకులను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు యోగా శిక్షణ ఇస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక శిక్షణ

ఉమ్మడి జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో పలు స్వచ్ఛంద సంస్థలు, శిక్షణ కేంద్రాల ఆధ్వర్యంలో యోగా సాధన చేస్తున్నారు. ఏలూరులోని యోగా ట్రస్ట్ సెంటర్, అమృత యోగ అండ్ వెల్నెస్ సెంటర్, హెల్త్ కేర్ యోగా సెంటర్, లీఫ్ హోమ్ యోగా క్లాసెస్, బ్రహ్మకుమారీస్ రాజయోగ, యోగా శిక్షణ సెంటర్, యోగా మెడిటేషన్ సెంటర్, తణుకులో స్వస్తిక్ చిరాయు యోగా అండ్ ఫిట్నెస్ సెంటర్, సైకాలజిస్ట్ హైపోథెరపిస్ట్ యోగా సెంటర్, తాడేపల్లిగూడెంలో పతంజలి యోగాలయం, కొవ్వూరులో పిరమిడ్ యోగా సెంటర్, గణపవరంలో సహజ యోగా మెడిటేషన్ సెంటర్, హనుమాన్ జిమ్ అండ్ హెల్త్ యోగాలయం, చోడిమెళ్లలో ఆనంద యోగాశ్రమం, పాలకొల్లు, నిడదవోలు, భీమవరంలలో బ్రహ్మకుమారీస్ మెడిటేషన్ సెంటర్‌లలో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు ప్రత్యేక అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. వీటిలో కొన్ని కేంద్రాల్లో ఉచితంగా, మరి కొన్ని కేంద్రాల్లో ప్రవేశ రుసుము చెల్లించి యోగ శిక్షణ పొందవచ్చు.

యోగాసనాల్లో రకాలు

- సూక్ష్మ ఆసనాలు : మెడ, భుజాలు, మోచేతులు, మణికట్టు, నడుము, మోకాళ్లు, మడమలకు సంబంధించిన ఆసనాలు
- నిలబడి చేసే ఆసనాలు : తడాసన, వృక్షాసన, పాదహస్తాసన, అర్థ చక్రాసన, త్రికోణాసన
- కూర్చుని చేసే ఆసనాలు: భద్రాసనం, వజ్రాసనం, వీరాసనం, అర్థ ఉష్ట్రాసన, ఉష్ట్రాసన, శశాంకాసన, ఉత్తాన మండూకాసనం, వక్రాసనం
- బోర్లా పడుకుని.. : మకరాసనం, భుజంగాసనం, శలభాసనం
- వెల్లకిలా పడుకుని ఆసనాలు: సేతుబంధాసనం, ఉత్తమ పారాసనం అర్థహలాసనం, పవనముక్తాసనం, శవాసనం
- ప్రాణాయామాలు : కపాల బాతి, అనులోమ.. విలోమం, నాడీ శోధన, శీతలీ, భ్రామరి

మహిళల్లోనూ ఆసక్తి పెరిగింది



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి క్లబ్ ఆధ్వర్యంలో యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నాం. ఉదయం 5.30 నుంచి సూర్యనమస్కారాలు, యోగా, మెడిటేషన్, ప్రాణాయామం చేస్తున్నారు. పెరుగుతున్న అనారోగ్య సమస్యలతో ఇటీవల మహిళలు యోగాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. యోగా శిక్షణకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు.

– నారిన సూర్యకుమారి, లయన్స్ ఫెమినా క్లబ్ అధ్యక్షురాలు, పాలకొల్లు

ఎన్నో ప్రయోజనాలు



ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగా సాధన అలవర్చుకోవం ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక శ్రేయస్సు కలుగుతుంది. యోగ అనేది పురాతన భారతీయ సాధన పద్ధతి. ఇది శరీరం, మనసు, ఆత్మల మధ్య సమతుల్యతను సాధించేందుకు ఎంతో సహాయపడుతుంది. పాఠశాలలో ప్రతి రోజూ విద్యార్థులకు యోగా ద్వారా ఆసనాలు వేయడంపై శిక్షణ ఇస్తున్నాం.

– మల్లేశ్వరరావు, పి.డి, వీరవాసరం హైస్కూల్

జ్ఞాపకశక్తి పెరిగింది



నా చిన్నతనం నుంచి యోగాసనాలు వేస్తున్నాను. పాలకొల్లులోని భారతీయ విద్యా భవన్ స్కూలులో పదో తరగతి చదువుతున్నాను. యోగా సాధన వల్ల గతంలో కంటే నా జ్ఞాపకశక్తి మెరుగుపడింది. చెన్నై, బెంగళూరు, గుంటూరులో జరిగిన యోగాసనం పోటీలలో కూడా పాల్గొన్నాను. ఎన్నో పోటీల్లో బహుమతులు కూడా పొందాను. యోగాలో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని లక్ష్యంగా ఉంది.

– కె.పావని, విద్యార్థి, రాయకుదురు

8 నియమాలపై శిక్షణ



యోగాలో 21 రోజులు శిక్షణ ఉంటుంది. దీనిలో యమ, నియమ, ఆసనం, ప్రాణాయామం, ప్రత్యహార, ధ్యానం, ధారణ, సమాధి అనే ఎనిమిది ఆసనాలపై శిక్షణ ఇస్తాం. వీటిలో శిక్షణ పొందిన వారు అబద్ధం ఆడలేరు, ఏ పనినైనా నియమంతో ఆచరించడం, శరీరాన్ని శుద్ధి చేసుకోవడం, ప్రకృతిలోని విశ్వశక్తిని ఆహ్వానించడం, మనస్సు నిశ్చలస్థితికి రావడం, ఆప్యాయతగా మాట్లాడటం అలవడతాయి.

– ప్రేమ్ నిరంతర్ గురూజి (నాన్న), యోగాభ్యాసకులు. పాలకొల్లు

నిత్య యోగా సాధకుడు..కందుల



యోగాసనాచార్యులు కందుల సత్యనారాయణ

ఆకివీడు: ఏడు పదుల వయస్సులోనూ నిత్య యోగా సాధకుడు.. లక్ష మందికి పైగా యోగాలో శిక్షణ ఇచ్చి అనేక మందిని గురువులుగా తయారు చేశారు యోగాసనాచార్యులు కందుల సత్యనారాయణ. రాష్ట్రంలోని పలు పట్టణాల్లో యోగా క్యాంపులు నిర్వహించడమే కాక అక్కినేని నాగార్జున, కవి చంద్రబోసు, రాజ్‌కోట్, కొణిదల నాగబాబు, యాంకర్ సుమ, మాదవపెద్ది సురేష్ వంటి ప్రముఖలకు యోగాలో శిక్షణ ఇచ్చారు. ఆకివీడులో 1984లో యోగా నేర్చుకోవడమేకాక అనతికాలంలోనే యోగా గురువుగా ఎదిగారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆయన చేసే జలనేతి, సూత్ర నేతి, గజకర్ణ, శంఖ ప్రక్షాళన వంటి యోగా పద్ధతులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ముక్కు రంధ్రాలలో ఉప్పువేడి నీటితో శుభ్రం చేయడం, ముక్కు నుంచి రబ్బరు కాథిటర్‌ని లోపలికి జొప్పించడం గొంతు ద్వారా బయటకు వచ్చే వరకు జాగ్రత్తగా తీసి ముక్కు, గొంతు శుభ్రం చేయడం, గోరు వెచ్చని ఉప్పునీటిని తాగి భుజంగాసనం, సూర్య నమస్కారం వంటి భంగిమలతో యోగా చేయించడం ద్వారా దేహంలోని లోపాల్ని, నరాల్లోనూ, ముక్కుల్లోనూ చిక్కుకుపోయిన వ్యర్థాల్ని తొలగించడం వంటి క్రియల ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందిస్తున్నారు. శుక్రవారం జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం నుంచైనా ప్రతి వ్యక్తికీ నిద్ర లేవగానే యోగా గుర్తుకురావాలని ఆయన పిలుపునిస్తున్నారు.

మిత్ర పురుగుల ఉత్పత్తిపై త్వరలో శిక్షణ



అల్లిపల్లిలో కొబ్బరి రైతులతో అంబాజీపేట ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు

చింతలపూడి: క్షేత్ర స్థాయిలో మిత్ర పురుగులు అధిక సంఖ్యలో ఉత్పత్తి చేసేలా రైతులకు శిక్షణ ఇప్పించడానికి కృషి చేస్తామని అంబాజీపేట ఉద్యాన పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బీఎన్‌వీ చలపతిరావు చెప్పారు. మండలంలోని అల్లిపల్లి గ్రామంలో ఉద్యాన పంటలను శాస్త్రవేత్తల బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్త చలపతిరావు మాట్లాడుతూ గత మార్చి నెలలో కొబ్బరి తోటల్లో ముట్టు పురుగు నివారణ కోసం ఎల్‌ఓడీపీ పథకంలో భాగంగా 53 హెక్టార్ల కొబ్బరి తోటల రైతులకు బ్రకాన్, గోనియోఝూస్ బదనికలను పంపిణీ చేసినట్లు తెలిపారు. మిత్ర పురుగుల విడుదల తరువాత మళ్లీ గురువారం తోటలను పరిశీలించామని, తమ పరిశీలనలో 50 నుంచి 60 శాతం వరకు నల్ల ముట్టు పురుగు ఉధృతి తగ్గినట్లు గుర్తించామన్నారు. అదే విధంగా సకాలంలో మిత్ర పురుగులను విడుదల చేసిన తోటల్లో 90 శాతం ముట్టు పురుగు తగ్గుదల కనిపించినట్లు తెలిపారు. మిత్ర పురుగులపై త్వరలో రైతులకు మరింత శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కీటక విభాగ శాస్త్రవేత్త డాక్టర్ వి.అనూష, ఉద్యాన అధికారి ఎండీ షాఫియ, కొబ్బరి అభివృద్ధి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కుమార్‌వేల్, ఫీల్డ్ ఆఫీసర్ కిరణ్, రైతులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వివాహిత ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంకు చెందిన తేజస్వికి ద్వారకా తిరుమల మండలం కొత్తపల్లికి చెందిన రెడ్డి పవన్‌కుమార్‌కు 2021లో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఇటీవల అదనపు కట్నం కోసం తేజస్విని భర్త పవన్‌కుమార్ వేధిస్తున్నాడని, మద్యం సేవించి వచ్చి శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడన్నారు. దీనికి అతని కుటుంబ సభ్యులు సహకరిస్తున్నారని తేజస్వి ఫిర్యాదులో పేర్కొందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

ఏషియన్ బ్యాడ్మింటన్ పోటీలకు 'తణుకు' క్రీడాకారులు



పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న బ్యాడ్మింటన్ అకాడమీ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తదితరులు

తణుకు టౌన్ : ఏషియన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత బ్యాడ్మింటన్ జట్టు ప్రాబబుల్స్‌కు తణుకులోని చిట్టూరి సుబ్బారావు, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమి క్రీడాకారులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ చెప్పారు. గురువారం తణుకులోని చిట్టూరి సుబ్బారావు, పుల్లెల గోపీచంద్ అకాడమి క్రీడాకారులు ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన ఆల్ ఇండియా అండర్-15, -17 జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పాల్గొని విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌కు తణుకు అకాడమీ నుంచి పాల్గొన్ని క్రీడాకారులు సమ్మెట్ల హేమంత్, మానే మనోజ్ఞ అండర్-15 మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో అత్యంత ప్రతిభ కనబర్చి బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ఈ విజయం ద్వారా చైనాలో జరిగే ఏషియన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత బ్యాడ్మింటన్ జట్టు ప్రాబబుల్స్‌కు వీరు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏషియన్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైన అకాడమి క్రీడాకారులను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, కోచ్‌లు సమ్మెట్ల సతీష్ బాబు, సుదర్శన్‌ను అభినందించారు. త్వరలో చైనాలో జరిగే ఏషియన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కూడా విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ చిట్టూరి రీనాసాయి, కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, ప్రిన్సిపాల్ పి.రవీంద్రనాథ్, ఎస్‌కేఎస్‌డీ గ్రూపు విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది క్రీడాకారులను అభినందించారు.

ఆన్‌లైన్‌లోనూ శ్రీవారి సేవలు



ద్వారకాతిరుమల: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమై విరాజిల్లుతున్న ద్వారకాతిరుమల చినవెంకన్నను నిత్యం వేలాది మంది భక్తులు దర్శిస్తుంటారు. క్షేత్రానికి విచ్చేసే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం అన్ని చర్యలు చేపడుతోంది. అయితే పలు సేవలను పొందేందుకు భక్తులు గంటల తరబడి ఆలయంలో వేచి ఉండాల్సి వస్తోంది. దీనిపై దృష్టి సారించిన రాష్ట్ర దేవదాయ శాఖ స్వామివారి దర్శనం, ఆర్జిత సేవలు, వసతి, విరాళాలు వంటి సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువచ్చింది.

స్వయంభూగా వెలసిన చినవెంకన్నను దర్శించేందుకు రాష్ట నలుమూలల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆలయంలో రోజురోజుకూ భక్తుల తాకిడి అధికమవుతోంది. ఈక్రమంలో దేవస్థానం శ్రీవారి సేవల వివరాలు, టికెట్ల నమోదు తదితర సేవలను ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా భక్తులకు అందుబాటులోకి తెచ్చింది. స్వామివారి సేవల్లో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ పాల్గొనే భక్తులు 'ఏపీటెంపుల్స్.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్ లోకి వెళ్లి మొబైల్ నంబర్‌తో లాగిన్ అయ్యి, అందులో వచ్చే దేవాలయాల్లో శ్రీవారి దేవస్థానాన్ని ఎంచుకుని సేవా టికెట్లు బుక్ చేసుకోవాలని ఆలయ అధికారులు సూచిస్తున్నారు. ఇదే వెబ్‌సైట్ ద్వారా దర్శనం టికెట్లు, రుములు, విరాళాలు ఇలా అన్ని సేవలను పొందొచ్చు.

సేవల వివరాలివే..

- సర్వ కైంకర్య సేవ రూ.3,116
- నిత్య ఆర్జిత కల్యాణం రూ.1,500
- వెండి గరుడ వాహనోత్సవం రూ.1,000
- వెండి శేష వాహనోత్సవం రూ.1,000
- స్వర్ణ తులసీ దళార్చన (ప్రతి బుధవారం ఉదయం 6 గంటలకు) రూ.2,116
- వివాహము టికెట్ రూ.500
- ఉపనయనం టికెట్ రూ.150
- వాహన పూజా టికెట్లు రూ.200, రూ.300, రూ.500
- అష్టోత్తర శతనామార్చన (ఇరువురికి ప్రవేశము) రూ.300

ఉచిత దర్శనం

- దీపారాధన రూ.10
- శీఘ్ర దర్శనము రూ.100
- అతి శీఘ్ర దర్శనము రూ.200
- పూర్తి క్షవరము రూ.25
- మూడు కత్తిరింపులు రూ.25
- లడ్డూ ప్రసాదం రూ.15
- పులిహోర ప్రసాదం రూ.15
- శర్కర పొంగలి ప్రసాదం రూ.15
- వడ ప్రసాదం రూ.20
- లడ్డూ మహా ప్రసాదం రూ.100
- స్నపన అభిషేకం (శుక్రవారం మాత్రమే) రూ.301
- సుప్రభాత సేవ (ఒక్కొక్కరికి) రూ.200
- అమ్మవారి వద్ద కుంకుమార్చన (శుక్రవారం మాత్రమే) రూ.300
- గోపూజ (దంపతులకు) రూ.116
- కోవెల పల్లకి ఉత్సవం రూ.1,000
- శ్రీ సత్యన్నారాయణ స్వామివారి వ్రతం రూ.116
- అన్నప్రాశన రూ.200
- స్తంభం పాట రూ.116
- దస్తం రూ.500
- ఆర్జిత బ్రహ్మోత్సవం రూ.516
- శ్రీ సీతారాముల వారి కోవెల ఉత్సవం (ప్రతి నెలా పునర్వసు నక్షత్రం రోజున) రూ.1,116
- వేద ఆశీర్వచనం రూ.1,116
- పూల అలంకరణ సేవ రూ.5,116
- వస్త్ర అలంకరణ సేవ రూ.10,116
- వస్త్ర అలంకరణ సేవ (శేషవస్త్ర మాల) రూ.12,616

భక్తులు వినియోగించుకోవాలి



శ్రీవారి క్షేత్రంలో రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా సామాన్య భక్తులకే పెద్ద పీట వేస్తున్నాం. శని, ఆదివారాల్లో వేలాదిగా తరలివస్తున్న భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. సౌకర్యాల పెంపుకు మరిన్ని చర్యలు చేపడుతున్నాం. భక్తులు ఆన్‌లైన్ సేవలపై పూర్తి అవగాహన పెంచుకుని, వాటిని వినియోగించుకోవాలి.

– వేంద్ర త్రినాథరావు, శ్రీవారి దేవస్థానం ఈఓ

సార్వత్రిక ఎన్నికల్లో సేవలు భేష్



ఏలూరు ఎస్పీ మేరి ప్రశాంతి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ, ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, నూజివీడు డీఎస్పీ కే.లక్ష్మయ్య, జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర , డీటీసీ డీఎస్పీ కే.ప్రభాకరరావు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నిరోధానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరి ప్రశాంతి చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం సబ్‌డివిజన్ల పరిధిలో కేసుల నమోదు, దర్యాప్తు వివరాలను ఎస్పీ సమీక్షించారు. నూజివీడు, పోలవరం సబ్‌డివిజన్ల పరిధిలో మద్యం, సారా తయారీ, అక్రమ రవాణాపై ముందస్తు ప్రణాళికలతో చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణకు జిల్లా వ్యాప్తంగా బ్లాక్‌స్పాట్స్ గుర్తించి వేగ నియంత్రణకు ఇసుకతో నింపిన డ్రమ్ములను బారికేడ్లుగా ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా నడుచుకుంటూ మెరుగైన సేవలందించాలని సూచించారు. అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మిస్సింగ్ కేసులు, 174 సీఆర్‌పీ కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు చేయాలని చెప్పారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రౌడీషీటర్లు, నేరస్తులు కదలికలపై నిత్యం నిఘా ఉంచాలని సూచించారు.

అధికారులకు మెమెంటో, సర్టిఫికెట్ల అందజేత

సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో జిల్లా పోలీస్ యంత్రాంగం ఎంతో సమర్థవంతంగా పని చేసిందని, ఎక్కడా అల్లర్లు, గొడవలు లేకుండా చేయడంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరు అభినందనీయమని ఎస్పీ మేరిప్రశాంతి చెప్పారు. ప్రజలు ఓటు హక్కును ప్రశాంతమైన వాతావరణంలో వినియోగించుకునేలా పోలీస్ వ్యవస్థ చిత్తశుద్ధితో పనిచేసిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులను సత్కరించి మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, నూజివీడు డీఎస్పీ కే.లక్ష్మయ్య, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర, డీటీసీ డీఎస్పీ కె.ప్రభాకరరావు, ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణలను అభినందించారు.

క్లుప్తంగా

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం



ఆరుగొలను గ్రామంలో దగ్ధమైన తాటాకిల్లు

తాడేపల్లిగూడెం రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పోర్షన్ల తాటాకిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని ఆరుగొలను గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో చిక్కాల జోగయ్యకు చెందిన తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న తాడేపల్లిగూడెం అగ్నిమాపక దళాధికారి జీవీ.రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. ఆస్తినష్టం రూ.6లక్షలు ఉంటుందని అగ్నిమాపక దళాధికారి జీవీ.రామారావు తెలిపారు. కాగా, మరో రూ.2.50లక్షలు నగదు ప్రమాదంలో దగ్ధమైనట్లు బాధితుడు జోగయ్యవాపోయారు.

యోగాతోనే మానసిక ఉల్లాసం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ యోగా డే సందర్భంగా గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం గుణ్ణం ఫంక్షన్ హాల్‌లో ముందస్తు యోగా డే నిర్వహించారు. సత్యసాయి యోగా కేంద్రం, ఉమర్ ఆలీషా కేంద్రం, ఆరా ఫౌండేషన్ యోగా శిబిరంలో వివిధ కార్యక్రమాలు జరిగాయి. జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు, డైమండ్స్ అధ్యక్షుడు కొప్పిసెట్టి రమణయ్యలు మాట్లాడుతూ యోగాతోనే మంచి ఆరోగ్యం సాధ్యపడుతుందన్నారు. యోగా గురువులకు కరిబండి రామకృష్ణ, బడుగు చంద్రశేఖర్, చిక్కాల భ్రమరాంబిక, సుభద్రలను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

అభయం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో...

స్థానిక అభయం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వాహకురాలు చిక్కాల భ్రమరాంబికా ఆధ్వర్యంలో స్థానిక 26వ వార్డు మునిసిపల్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుక్స్, స్టేషనరీ అందజేశారు. మండే మాధురి, ఆకాశం సాయి శృతి, చిక్కాల సుస్మిత, అమృత, శృతి, స్కూల్ ఉపాధ్యాయురాలు పద్మజ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పెంటపాడు, తాడేపల్లిగూడెం మండల్లాలోని ప్రాథమిక కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, హెల్త్ ప్రొవైడర్లు, ఆరోగ్య కార్యకర్తలకు క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వేపై మూడు రోజుల పాటు 18, 19, 20 తేదీలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు ఆదేశాలు మేరకు నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.పద్మ అధ్యక్షతన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సూర్యనారాయణ గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించి తద్వారా వ్యాధి సంక్రమణ పడ్డ వారిని గుర్తించాలని, తగు జాగ్రత్తలు తీసుకోవడం తదితర అంశాలపై ప్రజలకు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో డెంటల్ సర్జన్ డాక్టర్ భరత్, డాక్టర్ కోసూరి రవి కుమార్, ఏరియా ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో లీగల్ మెట్రాలజీ అధికారుల దాడులు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడులో లీగల్‌మెట్రాలజీ అధికారులు గురువారం దాడులు చేశారు. ఈ సందర్భంగా స్థానిక సూర్య దాల్ కంపెనీలో తనిఖీలు నిర్వహించారు. సరుకును, రిజిష్టర్‌ను పరిశీలించారు. ఈ దాడిలో తూకంలో తేడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. లీగల్‌మెట్రాలజీ ప్రకారం సరుకుపై ఎ1 కేసులు నమోదు చేసి సరుకును సీజ్ చేశారు. ఈ దాడుల్లో మెట్రాలజీ అధికారి అప్పలనాయుడు, పెంటపాడు తహసిల్దార్ సురేష్ బాబు, గూడెం, పెంటపాడు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వరాల వెంకన్న శేషవాహన సేవ



ఈడూరులో వరాల వెంకటేశ్వరస్వామి శేషవాహన సేవ దృశ్యం

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి స్వామివారి శేషవాహన సేవ ఘనంగా జరిగింది. ఉదయం మేడపాటి ఈశ్వరరెడ్డి, సూర్య భవాని దంపతులచే స్వామివారికి సుప్రభాతసేవ, మేలుకొలుపు, తోమాల సేవ నిర్వహించారు. అనంతరంశేషవాహన సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. విశేషంగా అలంకరించిన శేషవాహనంపై శ్రీస్వామి, అమ్మవార్లను ఉంచి మేళతాళాలు, గోవింద నామస్మరణల నడుమ గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

సకల రోగాల నివారిణి యోగ

- నిత్య సంజీవని యోగ
- యోగాతో యోగమే
- నేడు అంతర్జాతీయ యోగ దినోత్సవం



తణుకు ఎన్జీవో హోంలో యోగాభ్యాసన చేయిస్తున్న యోగా గురువు

తణుకు అర్బన్: మానవాళికి యోగా సంజీవనిగా, సకల రోగాల నివారిణిగా పరిగణిస్తుంటారు యోగా గురువులు. ఆరోగ్యమే మహా భాగ్యంగా భావిస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరి జీవనశైలి యోగాతో ముడిపడి ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు. అటువంటి యోగాను నిత్యం ఆచరిస్తే యోగం సిద్ధిస్తుందంటూ యోగా గురువులు చెబుతున్నారు. శరీరం ధృడంగా ఉండాలంటే యోగాసనాలు వేయాలని, యోగాసనాలు శరీరాన్ని నాజూగ్గాను, ధృఢత్వంగా ఉంచడానికి తోడ్పడుతుంటే, యోగాలోని ప్రాణాయామాలు ఊపిరితిత్తులను శుభ్రపరుస్తూ శ్వాసప్రక్రియను మెరుగుపరుస్తుందని చెబుతున్నారు. తణుకు ఎన్జీవోస్ హోంలో యోగ గురువు కర్రి శ్రీనివాసరెడ్డి గత 20 ఏళ్లకుపైగా ఉచితంగా యోగా శిక్షణ నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది జూన్ 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఎన్జీవో హోంలో యోగా శిక్షణ తరగతులకు వచ్చే యోగాభ్యాసకులకు యోగ గురువు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులతో పాటు మొక్కలు పంపిణీ చేస్తారు.

ఆరోగ్య మంత్రం యోగా...

యోగా ఉంటే చాలు మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందనేది నానుడి. అందుకు తగ్గట్లుగానే యోగా ద్వారా శరీరంలోని అన్ని అవయవాల్లోను స్పందన తీసుకురావచ్చు. అంతేకాకుండా దేహంలో ఉన్న హార్మోన్స్ అన్నింటిపై చలనం తీసుకువచ్చి వాటి పనితీరును మరింత మెరుగ్గా తీర్చిదిద్దుకోవచ్చనేది యోగా గురువుల వాదన. దీర్ఘకాలిక రోగాలు సైతం యోగాతో నయం చేసుకోవచ్చని యోగాభ్యాసకులు కూడా తమ అనుభవ పూర్వకంగా తెలుపుతున్నారు. ముఖ్యంగా సుగర్, బీపీ కంట్రోల్‌తో పాటు మలబద్ధకం, గ్యాస్, థైరాయిడ్ వంటి రోగాలను అదుపులో ఉంచుతుందని వైద్యులు కూడా చెబుతున్నారు.

వేలాది మందికి యోగా చేయించిన తృప్తి ఉంది



గత 30 ఏళ్లుగా తణుకుతోపాటు పలు ప్రాంతాల్లో ఉచితంగా యోగా నేర్పిస్తున్నాను. మానవాళి మనుగడకు యోగా నిత్య ఔషధి లాంటిది. తణుకు ఎన్జీవోస్ హోంతో పాటు ఇప్పటివరకు కొన్ని వేల మందికి ఉచితంగా యోగా నేర్పించిన తృప్తి నాకుంది. పది మంది ఒకే చోట ఉంటే చాలు యోగా నేర్పిస్తాననే నా ప్రచారం జిల్లా నలుమూలలా తాకింది.

– కర్రి శ్రీనివాసరెడ్డి, యోగా గురువు, తణుకు

యోగాతో మానసిక ఉల్లాసం



ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్యవంతుడిని ఏ శక్తి కూడా ఏమీ చేయలేదు. అటువంటి మంచి ఆరోగ్యం పొందాలంటే నిత్య యోగాభ్యాసన అవసరం. యోగా ముందు వజ్ర వైడూర్యాలు కూడా దిగదుడుపే. ముఖ్యంగా యోగాలోని ప్రాణాయామాలు నిత్యం చేయడం వలన శ్వాసకు సంబంధించిన సమస్యలు జీవితంలో తలెత్తవు.

– సీహెచ్ సీత, యోగాభ్యాసకురాలు

యోగా దినచర్య చేసుకోవాలి



నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ వయస్సుతో సంబంధం లేకుండా యోగాభ్యాసన చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. భవిష్యత్తులో యోగా చాలా కీలకం కానుంది. యోగాలోని ప్రాణాయామాలు మన ఊపిరితిత్తుల వ్యవస్థను పటిష్టపరచి మంచి ఆక్సిజన్‌ను తీసుకుని మనల్ని ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదపడుతుంది.

– విజయకుమార్, యోగాభ్యాసకులు

తణుకులో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం



తణుకులో కురిసిన వర్షం కారణంగా నీటమునిగిన రాష్ట్రపతి రోడ్డు

తణుకు: పట్టణంలో గురువారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా ఎండ వేడిమి కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది. గురువారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా రాష్ట్రపతి రోడ్డు చెరువును తలపించింది. మరోవైపు బ్యాంకు కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఎన్జీవో కాలనీ, ఇరగవరం కాలనీ ప్రాంతాల్లో వీధులు జలమయమయ్యాయి. ఇదిలా ఉంటే జిల్లాలో 241.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా తణుకులోనే అత్యధికంగా 49.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కావడం విశేషం.

ప్రజలకు సులభతరంగా రెవెన్యూ సేవలు



అత్తిలి రెవెన్యూ డే సందర్భంగా వీఆర్‌ఏలను సన్మానిస్తున్న తహసీల్దార్ తాతారావు



తణుకులో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

అత్తిలి: రెవెన్యూ సేవలను ప్రజలకు సులభతరంగా అందించడానికి రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలని, ప్రజలలో రెవెన్యూ శాఖపై ఉన్న అపోహలు తొలగించుకోవాలని తహసీల్దార్ తాతారవు తెలిపారు. గురువారం అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు ఈస్ట్ ఇండియా పాలకులు 1786 జూన్ 20న రెవెన్యూ బోర్డు ఏర్పాటు చేసారని, దీంతో ప్రతి ఏడాది జూన్ 20న రెవెన్యూ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈసందర్భంగా రిటైర్డు తహసీల్దార్ పోతురాజు, పాలూరు వీఆర్ఏగా పనిచేస్తున్న అడపా బుల్లబ్బాయి, మంచిలి వీఆర్‌ఏ సుబ్బారావును రెవెన్యూశాఖ తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శాంతకుమారి, వీఆర్వోలు అప్పాజీ, యాకోబు, భూషణం, తదితరులు పాల్గొన్నారు.

తణుకులో ఘనంగా రెవెన్యూ దినోత్సవం

తణుకు టౌన్: ప్రజలకు, సమాజానికి సేవలందించడంలో రెవిన్యూ శాఖకు శతాబ్దాల చరిత్ర ఉందని తణుకు డిప్యూటీ తహసీల్దార్ కోనా ఉదయ్ భాస్కర్ చెప్పారు. గురువారం తణుకు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ స్థాయిలలో పదవీ విరమణ చేసిన రెవిన్యూ ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌లు బీ సూర్యనారాయణరాజు, కె. కాశీ కృష్ణ, ఆర్ఐ భవానీ, రాష్ట్ర గ్రేడ్ 2 రెవిన్యూ అధికారుల అసోసియేషన్ అధ్యక్షుడు నిమ్మలపూడి సుధాకర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



అత్తిలి: విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లను అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు



తణుకు టౌన్: విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అత్తిలి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఇన్‌చార్జ్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు తెలిపారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గురువారం అత్తిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమం సర్పంచ్ గంటా విజేత అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా పదో తరగతి పరీక్షా ఫలితాలలో జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన రేవంత్‌కుమార్‌కు రూ. 10వేలు, మండల స్థాయిలో ద్వితీయస్థానం పొందిన త్రివేణికి రూ. 5వేలు నగదు ప్రోత్సాహకాన్ని జనసేన మండలపార్టీ అధ్యక్షుడు దాసం ప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు కొనగళ్ల విజయనిర్మల, మాజీ ఎంపీపీ మక్కా సూర్యరావు, టీడీపీ మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణరావు, బీజేపీ మండలాధ్యక్షుడు బాలం మహేష్, తోట త్రిమూర్తులు, ఎంఈవోలు ఎస్ రమేష్, ఎంపీఏ లకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

తణుకు టౌన్: క్రమ శిక్షణతో కూడిన విద్య ఉన్నత స్థితికి చేరుస్తుందని జిల్లా మానవత సంస్థ శాంతిర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు కోరారు. గురువారం తణుకు వెంకట్రాయపురం మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు దాతల సహాయంతో అందజేసే స్టూడెంట్ కిట్ల పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన విశ్రాంత ప్రదానోపాధ్యాయులు, హోమియోపతి వైద్యులు ఈమని సీతాపతిరావు జ్ఞాపకార్థం వారి సోదరి రిటైర్డ్ ఉపాధ్యాయురాలు ఈమని పద్మావతి, కుటుంబ సభ్యులు విద్యార్థులకు రూ.10వేల విలు నోట్ పుస్తకాలను, డైరీలను, విద్యాసామగ్రిని అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయుడు పెదపాటి గోపాల కృష్ణ, ఉపాధ్యాయిని అమ్మాజీ, స్థానిక నాయకులు మేడిచర్ల భాను ప్రసాద్, వినయ్, పేరెంట్స్ కమిటీ సభ్యులు లావణ్య, ప్రశాంతి, ఉమామహేశ్వరి, లలిత, దుర్గ, ఆశా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తాడేపల్లిగూడెం 11వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ షేక్ సికిందర్ బాషా పేర్కొన్నారు. కోర్టులో గురువారం న్యాయవాదులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సికిందర్ బాషా మాట్లాడుతూ రాజీ పడదగ్గ అన్ని కేసులైన క్రిమినల్, సివిల్, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, బ్యాంక్ తదితర కేసులు రాజీ చేయాలని, న్యాయవాదులు సహకరించాలని తెలిపారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్ శ్రీ, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.అరుంధతి, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇ.అన్నామణి, అన్ని మండలాల పోలీస్ అధికారులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయకుమార్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు సత్కారం

పెనుమంట్ర: గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలో చదివి ఇంటర్‌లో బాలికలు ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎంవీ విజయసింహారెడ్డి అన్నారు. ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాలలో మెరిట్ సాధించిన ఆంధ్రా అసోసియేషన్ యూకే జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం కళాశాల ఆవరణలో జరిగిన సభలో గోల్డ్ మెడల్స్‌తో సత్కరించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయసింహారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ బాలికల విద్యకోసం కొందరు దాతలు ట్రస్టుగా ఏర్పడి ఇక్కడ కళాశాల ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ప్రథమ స్థానం సాధించిన ఎస్.తరణి సాయి సంతోషిణికి, డాక్టర్ ఎంవీ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23న మానవత సమావేశం

పెంటపాడు : ఈనెల 23న ఉదయం 10 గంటలకు పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్ పాఠశాలలో మానవత మండల సమావేశం నిర్వహించనున్నట్లు మండల మానవత సంస్థ అధ్యక్షుడు నల్లమిల్లి ప్రభాకరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంస్థ ఉమ్మడి జిల్లా చైర్మన్ తాడేపల్లి మోహనరావు, మండల విద్యాశాఖాధికారి టీవీ రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో 2024–25 సంవత్సరకాలపు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేత

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా తణుకు ఎస్టీ కాలేజీలో ఐటీలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. గురువారం అసోసియేషన్ కార్యాలయంలో దాతలు అక్కిన బాపినీడు, చెరుకూరి శ్రీనివాస్‌లు రూ. 15 వేలను విద్యార్థినికి ఫీజుల నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నల్లజర్ల వెంకటేశ్వరరావు, అక్కిన బాపినీడు, ఎస్ రామకృష్ణారావు, ఎండీ స్వాలిహా, సాంబశివరావు తదతరులు పాల్గొన్నారు.

42 మందికి వృద్ధులకు వైద్య పరీక్షలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం 42 మందికి ఉచితంగా సుగర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. గురువారం తణుకు బ్యాంక్ కాలనీలో గల అసోసియేషన్ కార్యాలయంలో డాక్టర్ మోగంటిరాజేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పెనుమర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు

యలమంచిలి: గుంపర్రు పంచాయతీ సుంకరపాలెంలో ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక, సుబ్రహ్మణ్య ప్రయుక్త శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఉన్న ధ్వజ స్థంభానికి ఇత్తడి కవచం గ్రామానికి చెందిన రిటైర్డ్ డీవైఈఓ కొంపెల్ల వెంకట సూర్య సత్యనారాయణమూర్తి సహకారంతో తొడుగుతున్నట్లు చెప్పారు. గురువారం నిర్వాహకులు విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం సంకల్పం, గణపతి పూజ, లక్ష తులసి పూజ, అంజనేయ హోమం పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

తణుకు టౌన్: గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితుల మెరుగుదలకు 20 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో డీ శ్రీలలిత గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం సాయంత్రం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో గ్రామాల్లో చేపట్టాల్సిన వివిధ పనులు గురించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామీణ మంచినీటి సరఫరా ఏఈ మహ్మద్ బుస్రా మాట్లాడుతూ గ్రామాల్లోని రక్షిత మంచినీటి ట్యాంక్‌లను ప్రతి 15 రోజులకు ఒక సారి శుభ్రం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కారుమంచి ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు

తణుకు: కారుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ కారుమంచి యోహాన్ జన్మదినం పురస్కరించుకుని తణుకులో గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తణుకు శివారు మురికివాడల్లో పేదలకు ఆహారం అందజేసిన యోహాన్ అనంతరం బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కారుమంచి శామ్యూల్, పుట్టా సాయి. రామ్‌చరణ్, బెన్ను, కొల్లి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం, కంచి యాత్రకు బయలుదేరిన ఆర్టీసీ బస్సులు



తణుకు అర్బన్: ఆర్టీసీ బస్సులో అరుణాచలం, కంచి యాత్రకు వెళ్తున్న భక్తులు



తాడేపల్లిగూడెం(టీఓసీ) : ఏపీఎస్ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు

తణుకు అర్బన్: అరుణాచలం, కంచి యాత్ర స్పెషల్ ఆర్టీసీ బస్సులో భక్తులు తణుకు డిపో నుంచి గురువారం బయలుదేరినట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం పుణ్యక్షేత్రాలను దర్శించుకుని 22వ తేదీ అరుణాచలం గిరిప్రదక్షిణ, రాత్రి కంచిలోని ఆలయాలను సందర్శించి 24వ తేదీన తిరిగి తణుకు చేరుకుంటారని చెప్పారు. వచ్చేనెల 19వ తేదీన బయలుదేరే బస్సులకు శుక్రవారం నుంచి రిజర్వేషన్ చేసుకోవచ్చని రిజర్వేషన్ కోసం 94404 19144, వివరాలకు 98482 84384 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు తరలివెళ్లిన ఏపీఎస్ఆర్టీసీ లగ్జరీ బస్సు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ఆర్టీసీ తాడేపల్లిగూడెం బస్సు స్టేషన్ నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సర్వీస్ 2+2 సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సు గురువారం రాత్రి 7 గంటలకు బయిలుదేరి వెళ్లింది. ట్రాఫిక్ ఇంచార్జి సురేష్‌బాబు, గేరేజీ ఇంచార్జి చిట్టిబాబు, పీఆర్వో విజయకుమార్, అసోసియేషన్ నాయకులు, సిబ్బంది ప్రయాణికులకు శుభాకాంక్షలు తెలిపారు. 21వ తేదీన ఉదయం శ్రీకాళహస్తి, అనంతరం కాణిపాకం విఘ్నేశ్వర స్వామి క్షేత్రానికి, అదే రోజు రాత్రి శ్రీపురం శ్రీ మహాలక్ష్మి గోల్డెన్ టెంపుల్, అక్కడ నుంచి 22వ తేదీ తెల్లవారుజామున రెండు గుంటలకు అరుణాచలం, అక్కడ గిరి ప్రదక్షిణ, స్వామి వారి దర్శనం అనంతరం 23వ తేదీ ఆదివారం తాడేపల్లిగూడెం చేరుతుందని వెల్లడించారు. అలాగే జూలై 19వ తేదీన పౌర్ణమి గిరి ప్రదక్షిణకు బయలుదేరే అరుణాచలం ప్రత్యేక సర్వీస్ చార్జీ కేవలం రూ.2600 మాత్రమేనని, ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయడమైనదని, మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు 99592 25488, 9959753102, 9985544411 సంప్రదించాలని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి తెలిపారు.